సాక్షి
వికారాబాద్
శనివారం । 23 । డిసెంబర్ । 2023



చిగురించిన కంది ఆశలు
బషీరాబాద్ మండలంలో ఈ ఏడు కంది పంట ఆశాజనకంగా ఉంది. ఇక్కడి భూములు కంది సాగుకు ఎంతో అనుకూలం. 8లో▸



మహిళలను వేధిస్తే చర్యలు
మహిళలు, విద్యార్థినులను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వికారాబాద్ ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి హెచ్చరించారు. 8లో▸



తెల్ల జొన్నలకు డిమాండ్
తెల్ల జొన్నలకు డిమాండ్ పెరిగింది. ఏటేటా సాగు తగ్గుముఖం పట్టడం.. ధరలు పెరగడం నిత్యకృత్యంగా మారింది. 9లో▸

న్యూస్‌రీల్

నేటి నుంచి సదరం స్లాట్ బుకింగ్
వికారాబాద్ అర్బన్: ఈ నెల 27, 29 తేదీల్లో తాండూరు ప్రభుత్వ ఆస్పత్రిలో సదరం క్యాంపు నిర్వహించనున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరం క్యాంపునకు హాజరయ్యే దివ్యాంగులు 23వ తేదీ ఉదయం 11గంటల నుంచి మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఈ నెల 27, 30వ తేదీల్లో వికారాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో నిర్వహించే క్యాంపులకు హాజరుకావాలని సూచించారు. గతంలో సదరం సర్టిఫికెట్లు పొంది కాలపరిమితి దాటిన వారి తోపాటు కొత్తగా స్లాట్ బుక్ చేసుకున్న అభ్యర్థులు హాజరుకావాలని తెలిపారు.

ఆర్టీసీపై బీఆర్‌ఎస్‌ది మొసలి కన్నీరు
టీజేఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్

పరిగి: గత ప్రభుత్వం ఆర్టీసీని, ఉద్యోగులను సర్వనాశనం చేసిందని టీజేఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్ ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్టీసీ డిపోలను తాకట్టు పెట్టడమే కాకుండా ఉద్యోగులు పొదుపు చేసుకున్న రూ.3000 కోట్లను వాడుకుందని ఆరోపించారు. బుధవారం అసెంబ్లీలో ఆర్టీసీని కాంగ్రెస్ ప్రభుత్వమే నాశనం చేస్తోందని అనడం సరికాదన్నారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను ప్రభుత్వంలో విలీనం చేస్తున్నామని నాటకమాడిన బీఆర్‌ఎస్ ఇప్పుడు ఏం ముఖం పెట్టుకుని ఆర్టీసీ ప్రస్తావనను అసెంబ్లీలో లేవనెత్తిందని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ మాయ మాటలను ఆర్టీసీ ఉద్యోగులు నమ్మరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులను ఆదుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వారికి ఎంతో మేలు చేస్తుందన్నారు. ముందుగా ఆర్టీసీకి రూ.374 కోట్లు అందించి లాభాల బాట పట్టించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేసిందని పేర్కొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు
సీసీఐ సీఎండీ లలిత్‌కుమార్ గుప్తా



పత్తిని పరిశీలిస్తున్న లలిత్‌కుమార్ గుప్తా

పూడూరు: పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా చూడాలని సీసీఐ సీఎండీ లలిత్‌కుమార్ గుప్తా నిర్వాహకులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని అంగడిచిట్టంపల్లి ధరణి కాటన్ జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పత్తి కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని ఆదేశించారు.రైతులు పత్తి కోసిన వెంటనే మిల్లులకు తరలించరాదని సూచించారు. ముందు బాగా ఆరబెట్టి 8శాతం తేమ ఉండేలా తెస్తే రూ. 7,020 మద్దతు ధర వస్తుందని తెలిపారు. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి సారంగపాణి, అధికారులు విజయ్‌కుమార్, బాలచందర్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో 'సెమీ క్రిస్మస్'
సాక్షి, రంగారెడ్డిజిల్లా: క్రైస్తవ జన సమితి తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో రంగారెడ్డి కలెక్టరేట్లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు ఈ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. శాంతి, సమాధానం, ప్రేమ క్రీస్తు బోధనలు చెబుతాయని వివరించారు.

సబ్సిడీలకు మంగళం!



పాత పద్ధతిలో పొలాన్ని చదును చేస్తున్న రైతు

పదేళ్లుగా అందని వ్యవసాయ రాయితీ పరికరాలు
- కిరాయి యంత్రాలను వినియోగిస్తున్న రైతులు
- కొత్త ప్రభుత్వంపై ఆశలు

దోమ: ఆధునిక వ్యవసాయం అందని ద్రాక్షగా మారుతోంది. వ్యవసాయ సాంకేతికత, యాంత్రీకరణ పరిజ్ఞానం ఆశించిన స్థాయిలో రైతులకు అందడం లేదు. మారుతున్న కాలానికి అనుగుణంగా తక్కువ పెట్టుబడితో వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో వ్యవసాయ శాఖ చేస్తున్న ప్రచారం కార్యరూపం దాల్చ డం లేదు. రాయితీ పథకాలు ఒక్కొక్కటిగా అటకెక్కుతున్నాయి. దీంతో రైతన్నల ఆశలపై నీళ్లు చల్లుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకాలను పక్కన పెట్టడంతో రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. కొత్త ప్రభుత్వమైనా తమకు సబ్సిడీ యంత్రాలు అందిస్తుందా లేదా అనే ఆలోచనలో రైతులు ఉన్నారు.

అందని పరికరాలు

జిల్లాలో ఎక్కువ శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. దాదాపు 2.57లక్షల మంది వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. గతంలో రైతులకు వివిధ రకాల పథకాలు, సబ్సిడీ కింద రోటోవేటర్, కల్టివేటర్, తైవాన్ పంపులు, మినీ ట్రాక్టర్లు, టార్పాలిన్లు వంటి వ్యవసాయ పనిముట్లను ప్రభుత్వం పంపిణీ చేసేది. కానీ గత ప్రభుత్వం ఎలాంటి రాయితీపై పరికరాలు సరఫరా చేయలేదు.

నిలిచిపోయిన పథకాలు

2006 నుంచి వ్యవసాయ రాయితీ పథకాలు ఒక్కొక్కటిగా నిలిచిపోయాయి. సాగుకు ఉపయోగపడే నాగళ్లు, ఇతర పనిముట్లు పంపిణీ 2014లోనే నిలిచిపోయాయి. దీంతో రైతులు పాత పద్ధతి ఎద్దులను ఉపయోగించి పంటలను సాగు చేయాల్సి వస్తోంది. మరింత కొంత మంది రైతులు కిరాయి చెల్లించి ట్రాక్టర్లతో పొలం పనులు చేయిస్తున్నారు. మరి కొంత మంది ఎప్పటికైనా ఉపయోగపడతాయి కదా అని భారమైనా వ్యవసాయ పనిముట్లను కొనుగోలు చేస్తున్నారు. ఆరేళ్ల నుంచి రైతులకు సబ్సిడీ పరికరాలు అందక అవస్థలు పడుతున్నారు.

కొత్త ప్రభుత్వంపై ఆశలు

బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రైతులకు సబ్సిడీ పరికరాలు అందలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. ఈ ప్రభుత్వంలోనైనా తమకు రాయితీ యంత్రాలు అందుతాయా? లేదా అనే సందేహాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. సబ్సిడీ పరికరాలు పంపిణీ చేస్తే సాగుకు ఎంతగానో ఉపయోగపడతాయని రైతులు అంటున్నారు.

వ్యవసాయ పరికరాలు ఇవ్వాలి



రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు ఇవ్వాలి. పదేళ్లుగా రాయితీ పనిముట్లు అందక ఎన్నో అవస్థలు పడుతున్నాం. బహిరంగ మార్కెట్‌లో వ్యవసాయ పరికరాల ధర చాలా ఉంది. కొత్త ప్రభుత్వం సబ్సిడీ పరికరాలు పంపిణీ చేసి ఆదుకోవాలి.

– జంగయ్య, రైతు, బొంపల్లి

ప్రభుత్వం అండగా ఉండాలి



ఏళ్ల తరబడి సబ్సిడీ పరికరాలు రాకపోవడంతో వ్యవసాయం చేయాలంటేనే భయమేస్తోంది. పరికరాల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి దాపురిస్తోంది. ప్రస్తుతం కిరాయి యంత్రాలతో పనులు చేసుకుంటున్నాం.కొత్త ప్రభుత్వం తమకు అండగా ఉండాలి.

– కృష్ణయ్య, రైతు, ఐనాపూర్

ఎలాంటి ఆదేశాలు రాలేదు



సబ్సిడీ పథకాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేవు. రాయితీ పథకాలు అమలు చేయాలని రైతులు అడుగుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే చర్యలు తీసుకుంటాం.

– ప్రభాకర్‌రావు, ఏఓ, దోమ



పూడూరు: దామగుండం వాసులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

అటవీ భూముల పరిశీలన

పూడూరు: మండలంలోని దామగుండం అటవీ ప్రాంతాన్ని, అలాగే నేవీ రాడార్ వ్యవస్థ ఏర్పాటు కోసం కేటాయించిన స్థలాన్ని శుక్రవారం కలెక్టర్ సీ నారాయణరెడ్డి ఫారెస్ట్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పూడూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్ పటేల్, నాయకుడు సత్యానంద స్వామి కలెక్టర్‌ను కలిశారు. దామగుండం రామలింగేశ్వర స్వామి ఆలయం ఎంతో పవిత్రమైనదని, ఈ ఆలయానికి 45 ఎకరాల భూమి ఉందని తెలిపారు. అయితే ఫారెస్ట్ అధికారులు ఆలయ భూములపై తప్పుడు సమాచారం ఇస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి ఇబ్బంది లేకుండా చూస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ విజయకుమారి, తహసీల్దార్ ఉమాదేవి, డిప్యూటీ ఎమ్మార్వో మోహన్, సర్వేయర్ సుధాకర్, ఫారెస్టు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల పరిశీలన

అనంతగిరి: వికారాబాద్ పరిధిలోని ప్రభుత్వ భూములను శుక్రవారం కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించారు. పట్టణంలోని బిల్లాదాఖలా భూములను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ విజయకుమారి, అటవీ శాఖ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్, తహసీల్దార్లు లక్ష్మీనారాయణ, రమాదేవి, ఆర్‌అండ్‌బీ అధికారులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఇద్దరు చిన్నారులకు కోవిడ్

నాంపల్లి: నిలోఫర్ ఆసుపత్రిలో కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి. ఆగాపుర ప్రాంతానికి చెందిన 14 నెలల చిన్నారికి కోవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయింది. శుక్రవారం రంగారెడ్డి జిల్లాకు చెందిన మరో రెండు నెలల చిన్నారికి పాజిటివ్ వచ్చింది. దీంతో నిలోఫర్‌లో కోవిడ్ కేసుల సంఖ్య రెండుకు చేరింది. ఇవి పాత వేరియంట్ కేసులా లేక కొత్త వేరియంట్ (జేఎన్–1) కేసులా అని తెలుసుకునేందుకు చిన్నారి రోగుల రక్త నమూనాలను జీనోమిక్ సీక్వెన్స్ సెంటర్‌కు పంపించినట్లు నిలోఫర్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి తెలిపారు. చిన్నారులకు కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో వైద్యాధికారులు అప్రమత్తం అయ్యారు. ఆసుపత్రిలో ప్రత్యేక కోవిడ్ వార్డును ఏర్పాటు చేశారు. ఇన్ఫోసిస్ భవనంలో 120 బెడ్ల సామర్థ్యంతో ప్రత్యేక వార్డును అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికిప్పుడు కోవిడ్ కేసులు పెరిగినా 20 మంది రోగులకు సరిపడా సౌకర్యాలను సమకూర్చినట్లు, అవసరమైతే వార్డును పూర్తిస్థాయిలో వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని డాక్టర్ ఉషారాణి తెలిపారు.

శేరిలింగంపల్లిలో కోవిడ్ పాజిటివ్ కేసు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో కోవిడ్ ఒక పాజిటివ్ కేసు నమోదైనట్లు అధికారులు తెలిపారు. గౌలిదొడ్డికి చెందిన 34 ఏళ్ల వ్యక్తికి కోవిడ్ ఉన్నట్లు నిర్ధారణ కావడంతో కాంటినెంటల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నట్లు శుక్రవారం శేరిలింగంపల్లి అర్బన్ హెల్త్ సెంటర్ సీహెచ్‌ఓ స్వామి తెలిపారు.



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

ఉపాధ్యాయులకు ఒత్తిడి పెరుగుతోంది

- 'ఎఫ్‌ఎల్‌ఎన్, ఉన్నతి, లక్ష్య'ను రద్దు చేయాలి
- పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్

ఇబ్రహీంపట్నం రూరల్: ఎఫ్‌ఎల్‌ఎన్, ఉన్నతి,లక్ష్య కార్యక్రమాల వల్ల ఉపాధ్యాయులపై ఒత్తిడి పెరిగి తరగతి గదికి, విద్యార్థులకు దూరమవుతున్నారని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్ యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమాలను రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం ఆయన డీఈఓ సుశీందర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు ఎఫ్‌ఎల్‌ఎన్ ప్రోగ్రాం, ఆరు నుంచి తొమ్మిదవ తరగతి వరకు ఉన్నతి, పదవ తరగతి విద్యార్థులకోసం లక్ష్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నరన్నారు. ఈ కార్యాక్రమాల వల్ల ఉపాధ్యాయుడు స్వేచ్ఛ కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అకడమిక్ సిలబస్ పూర్తి చేసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో డాక్టర్ పరమేశ్, గోపాల్, వెంకటప్ప, రామస్వామి, కృష్ణ తదితరులు ఉన్నారు.

అశాస్త్రీయ విధానానికి డీటీఎఫ్ వ్యతిరేకం

ఉన్నతి కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని, ఈ అశాస్త్రీయ విధానాన్ని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఖండిస్తోందని సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు చంద్రారెడ్డి, సెక్రటరీ చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీ నాగార్జునరావు అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. నూతన విద్యా విధానం 2020లో అశాస్త్రీయ విధానాలున్నాయని మేధావులు వ్యతిరేకించారని అన్నారు. ఎక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలలో ఈ కార్యక్రమం ఎలా విజయవంతం చేయాలో అధికారులు పునారాలోచించాలన్నారు.

మత్తు.. చిత్తు..!

- గంజాయికి బానిసలవుతున్న యువత
- జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్న వాడకం
- ఆందోళనలో పిల్లల తల్లిదండ్రులు
- నిఘా వ్యవస్థల వైఫల్యం



ఇటీవల వికారాబాద్‌లో పట్టుబడిన గంజాయి

వికారాబాద్: జిల్లాలో గంజాయికి బానిసలైన వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. ఐదేళ్ల క్రితమే ఈ ప్రాంతంలో గంజాయి సంస్కృతి పురుడు పోసుకుంది. ఇటీవల మరింత పెరిగింది. గంజాయి తీసుకుంటున్న యువత, విద్యార్థులు ఆకతాయిలుగా మారుతున్నారు. మత్తులో ఏం చేస్తున్నారో తెలియకుండా పోతోంది. తరచూ అక్కడక్కడ జరుగుతున్న ఘటనలు ఆడపిల్లల తల్లిదండ్రులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. బయటకు వెళ్లిన బాలికలు, యువతులు ఇంటికి వచ్చే వరకు వారి కుటుంబాల్లో ఆందోళన తప్పడం లేదు. ఆరు నెలల క్రితం తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికల వెలిబుచ్చిన ఆవేదన అప్పట్లో కలకలం రేపిన విషయం తెలిసిందే. ఇటీవల హైదరాబాద్‌లో గంజాయి, డ్రగ్స్, తదితర మాదకద్రవ్యాల వినియోగం, విక్రయంపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్న నేపథ్యంలో అదే తరహాలో జిల్లాలో కూడా చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. యువత తాగుడు, గుట్కాలు, గంజాయికి బానిసలై ఆ మత్తులో బాలికలు, యువతులను వేధించడం మొదలు పెట్టారు. గ్రామాల్లో మద్యానికి, గంజాయికి బానిసలైన యువత బాలికలను వేధిస్తున్నారంటూ తరచూ చైల్డ్ లైన్ దృష్టికి వస్తున్నట్లు తెలిసింది. ఇది పోలీసులకు సవాల్‌గా మారింది. అయితే పోలీసులు కొంత కాలంగా గంజాయి, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పెరిగిపోతున్న స్మోకర్స్

గంజాయి స్మోక్ చేసే వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. ముఖ్యంగా యువత, విద్యార్థులే అధికంగా ఉన్నారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీల్లో 500 నుంచి 1000 మందికి పైగా యువత, విద్యార్థులు గంజాయికి అలవాటు పడినట్లు నిఘా సంస్థలు అంచనా వేస్తున్నాయి. చిన్న చిన్న గ్రామాల్లో సైతం పదుల సంఖ్యలో యువత గంజాయి బారిన పడినట్లు ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరోపణలు వచ్చినప్పుడు.. ఏదైనా సంఘటన వెలుగు చూసినప్పుడు, ఎన్నికల సమయంలో హడావుడి చేయడం తప్ప ఆ తరువాత మత్తు పదార్థాల కట్టడి గురించి పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నిర్వహించిన తనిఖీల్లో 20కిలోలకు పైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆ తరువాత తనిఖీలు చేసిన దాఖలాలు లేవు.

నిఘా వ్యవస్థల వైఫల్యం

గంజాయి, మత్తు పదార్థాల రవాణాకు అడ్డుకట్ట వేయడంలో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల రైళ్లలో గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతాల నుంచి జిల్లాకు రవాణా అవుతున్నట్టు పోలీసులు గుర్తించారు. దొరికిన వారిపై కేసులు నమోదు చేసి వదిలేయడం తప్ప, సరుకు ఎక్కడి నుంచి వస్తోంది.. ఎవరెవరికి సరఫరా చేస్తున్నారు.. సూత్రధారులు ఎవరు అనే కోణంలో దర్యాప్తు జరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కలెక్టర్ నారాయణరెడ్డి గంజాయి రవాణా, విక్రయం వంటి వాటిపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి కట్టడి చేయాలని ఆదేశించారంటే దాని తీవ్రత ఏమేరకు ఉందో ఇట్టే అర్థమవుతుంది.

మరోసారి బంపర్ ఆఫర్

- ఆన్‌లైన్‌లో ట్రాఫిక్ మెగా లోక్ అదాలత్
- పెండింగ్ ఈ–చలాన్లు చెల్లించే అవకాశం
- 60నుంచి 90శాతం డిస్కౌంట్
- వెబ్‌సైట్‌లోనే ప్రత్యేకంగా ఏర్పాటు కానున్న లింకు
- ఈ 26 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి ఈ–చలాన్ జరిమానా బకాయిలు భారీ తగ్గించుకోవడానికి అవకాశం కల్పించే ట్రాఫిక్ మెగా లోక్ అదాలత్ ఈ నెలలో ప్రారంభం కానుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు ఆన్‌లైన్‌లో దీన్ని నిర్వహించడానికి హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్లు సన్నాహాలు చేస్తున్నాయి. ఈ–చలాన్లు పెండింగ్‌లో ఉన్న వాటిలో 91 శాతం ద్విచక్ర వాహనాలు, సామాన్యులకు సంబంధించినవే ఉన్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం భారీ డిస్కౌంట్ ఇస్తోంది. గడిచిన కొన్నేళ్లుగా ట్రాఫిక్ పోలీసులు భారీ స్థాయిలో చలాన్లు విధించారు. అయితే ఆ స్థాయిలో వాహనచోదకుల నుంచి చెల్లింపులు జరగలేదు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రూ.800 కోట్లు ఈ–చలాన్ బకాయిలు ఉన్నాయి. రాజధానిలోని మూడు కమిషనరేట్ల పరిధిలోనే వీటిలో 70 శాతం... అంటే దాదాపు రూ.560 కోట్ల మేర పెండింగ్‌లో ఉండిపోయాయి.

❖ గతంలో ప్రతి ఏడాది ట్రాఫిక్ మెగా లోక్ అదాలత్‌లు జరిగేవి. 2016 అక్టోబర్ తర్వాత వీటికీ బ్రేక్ పడింది. సుదీర్ఘకాలం తర్వాత గత ఏడాది 45 రోజుల పాటు నిర్వహించారు. దీన్ని మూడు కమిషనరేట్లకు చెందిన 2.92 కోట్ల వాహనచోదకులు వినియోగించుకుని రూ.295 కోట్లు చెల్లించారు. సాధారణంగా మెగా లోక్ అదాలత్ ఒకే రోజు, నిర్దేశించిన ప్రాంతంలో జరుగుతుంది. అయితే ట్రాఫిక్ లోక్ అదాలత్ మాత్రం ఆన్‌లైన్‌లోనే జరగనుంది. ఈ నెల 26 నుంచి వచ్చే నెల 10 వరకు నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. అవసరాన్ని బట్టి ఈ గడువు పెంపునకు సంబంధించిన నిర్ణయం తీసుకుంటారు.

ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా..

వాహన చోదకులు తమ వాహనంపై జారీ అయి ఉన్న పెండింగ్ ఈ–చలాన్ వివరాలు పోలీసు అధికారిక వెబ్‌సైట్లతో పాటు ఈ–చలాన్‌కు సంబంధించిన ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు. వాటిలో ఏర్పాటు చేయబోయే ప్రత్యేక లింకు ద్వారా ఎంటర్ కావాలి. అందులో వాహనం వివరాలు పొందుపరాలి. ప్రత్యేక అప్లికేషన్ డిసౌంట్ పోను ఎంత మొత్తం చెల్లించాలో చూపిస్తుంది. అక్కడ నుంచే వివిధ పేమెంట్ గేట్‌వేల్లోకి ద్వారా, ఈ–సేవ, మీ–సేవ కార్యాలయాల ద్వారానూ పేమెంట్లు చేయవచ్చు. పెండింగ్ చలాన్ల నేపథ్యంలో ఆయా వాహనాలపై గతంలో చార్జ్‌షీట్లు దాఖలై ఉంటే వాటినీ పోలీసులు ఉపసంహరించుకుంటారు. తోపుడు బళ్లపై వ్యాపారాలు చేసే చిరు వ్యాపారులపై కేసులు నమోదు చేసే ట్రాఫిక్ పోలీసులు వారికి ఈ–చలాన్ జారీ చేస్తారు. ఆర్టీసీ బస్సులపై జారీ అయ్యే ఈ–చలాన్లను ఆ సమయంలో వాహనం నడిపిన డ్రైవరే చెల్లించాలి. ఈ రెండు కేటగిరీలకు చెందిన వారికి సైతం మెగా లోక్ అదాలత్‌లో అవకాశం ఇస్తున్నారు.

ధ్యాన జగత్ నిర్మాణమే లక్ష్యం

- పీఎస్‌ఎస్‌ఎం గ్లోబల్ ఫౌండర్ పరిమళ పత్రి
- పుస్తకాలు, క్యాలెండర్ ఆవిష్కరణ



ధ్యాన సందేశమిస్తున్న పరిమళ పత్రి

కడ్తాల్: ధ్యానాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్(పీఎస్‌ఎస్‌ఎం) నిరంతరం పనిచేస్తోందని, దివంగత ధ్యాన గురువు బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ చిన్నకూతురు, పీఎస్‌ఎస్‌ఎం గ్లోబల్ ఫౌండర్ పరిమళ పత్రి అన్నారు. మండల పరిధిలోని మహేశ్వర మహా పిరమిడ్ ధ్యాన కేంద్రంలో నిర్వహిస్తున్న పత్రీజీ ధ్యాన మహాయాగాలు శుక్రవారం రెండో రోజుకు చేరాయి. ఉదయం 5 నుంచి 8గంటల వరకు సంగీత వేణునాద గానంతో ప్రాతఃకాల ధ్యానం చేశారు. అనంతరం పరిమళ పత్రి మాట్లాడుతూ.. పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్ కర్నూల్ జిల్లాలో చిన్న సొసైటీగా ప్రారంభమై.. నేడు గ్లోబల్ పీఎస్‌ఎస్‌ఎంగా ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిందన్నారు. ఎటువంటి తారతమ్యాలు లేకుండా ధ్యానం ఆచరించాలని సూచించారు. పత్రీజీ ఆశయాలకు అనుగుణంగా ధ్యానాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ధ్యాన అభివృద్ధి కార్యక్రమాలకు పిరమిడ్ ధ్యానులు అందిస్తున్న సహకారం హర్షణీయమన్నారు. పత్రీజీ పెద్ద కూతురు పరిణీత మాట్లాడుతూ.. ప్రపంచాన్ని ధ్యానమయం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం ధ్యాన మహాయాగంలో పత్రీజీ వీడియో సందేశంతో ధ్యాన సందేశం అందించారు. సైంటిస్టు నాగేశ్వర రావు రచించిన మౌన మహా విజ్ఞానం, మిలారెప జీవిత చరిత్ర పుస్తకాలతో పాటు, పీఎంసీ ఛానల్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 క్యాలెండర్‌ను పరిమళ పత్రి, పరిణీత పత్రి ఆవిష్కరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు గురువులు, పిరమిడ్ మాస్టర్‌లు ఆధ్యాత్మిక, ధ్యాన సందేశంతో పాటు ధ్యాన అనుభవాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ధ్యాన గురువు స్వర్ణమాల పత్రి, ట్రస్ట్ సభ్యులు హనుమంతరాజు, సాంబశివరావు, శ్రీరాంగోపాల్, మాధవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇది ప్రజల భవనం


ప్రజాభవన్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి దంపతులు

తాండూరు టౌన్: ఇది ప్రజల కోసమే నిర్మించిన భవనమని, వారికి ఎలాంటి సమస్యలు ఉన్నా ఇక్కడికి వచ్చి చెప్పాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి కోరారు. శుక్రవారం ప్రజాభవన్ (ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం)ను ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఇక నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రజాభవన్‌గా పిలవనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బైక్‌పై వెంబడించి..

దంపతుల వద్ద బంగారం, నగదు అపహరణ

మోమిన్ పేట్: బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని దుండగులు.. దంపతులు వెళ్తున్న మరో బైక్‌ను ఢీకొట్టి వారివద్ద నుంచి బంగారం, నగదు దోచుకెళ్లిన సంఘటన మోమిన్‌పేట్ మండల పరిధిలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు.. మోమిన్‌పేట మండలం టేకులపల్లికి చెందిన గురుమూర్తిరెడ్డి తన భార్య సువర్ణతో కలిసి ఇటీవల రొంపల్లి గ్రామంలోని తన బంధువుల వద్దకు వెళ్లారు. గురువారం సాయంత్రం 6గంటల మయంలో బైక్‌పై తిరిగి సొంత గ్రామానికి వస్తుండగా బంట్వారం దగ్గర నుంచి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వెంబడించి ఇజ్రాచిట్టంపల్లి సమీపంలో వెనుకనుండి వారి బైక్‌ను ఢీకొట్టి కిందపడేశారు. కత్తితో బెదిరించి సువర్ణ మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడు, రూ.5వేల నగదు, వెండి ఉంగరం లాగేసుకొని పరారైనట్లు తెలిపారు. దుండగులు ముఖానికి మాస్కులు వేసుకోవడంతో గుర్తుపట్టలేకపోయామని బాధితులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మోమిన్ పేట్ ఎస్‌ఐ విఠల్ రెడ్డి తెలిపారు.

హత్యకేసులో జీవితకాలం జైలు

రూ.10 వేల జరిమానా విధించిన కోర్టు

నందిగామ: మహిళను హత్య చేసిన ఘటనలో నిందితులకు జీవితకాలం జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానాను న్యాయస్థానం విధించింది. ఇన్‌స్పెక్టర్ సురేష్ వివరాల మేరకు.. నందిగామ మండలం ఈదులపల్లికి చెందిన బొల్లం రాజేశ్వరి(22)ని ఆమె భర్త ప్రవీణ్, మామ జంగయ్యలు 2017లో హత్య చేశారు. దీనిపై నాటి ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ కేసు నమోదు చేశారు. సమగ్రంగా విచారణ జరిపి చార్జిషీట్ సమర్పించారు. కేసును ఎల్‌బీనగర్ కోర్టులో పీపీలు బాల గంగాధర్‌రెడ్డి, రఘులు వాదించి సరైన సాక్ష్యాలను సమర్పించారు. దీంతో న్యాయమూర్తి నిందితులకు జీవితకాలం జైలుశిక్షతో పాటు జరిమానా చెల్లించాలని శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

భార్య మృతికి కారణమైన భర్తకు జీవితఖైదు

కొత్తూరు: పెళ్లైన నెల రోజులకే భార్యను మానసికంగా, శారీరకంగా హింసించి ఆమె మృతికి కారణమైన భర్తకు రంగారెడ్డి జిల్లా కోర్టు జీవిత ఖైదు విధించినట్లు సీఐ శంకర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సిద్దాపూర్ పంచాయతీ చింతగట్టుతండాకు చెందిన లక్ష్మణ్‌నాయక్, రజితలకు 2019లో వివాహం జరిగింది. లక్ష్మణ్ భార్యను తీవ్రంగా కొట్టడంతో ఆమె మృతి చెందింది. ఈ సంఘటనపై మృతురాలి మామ సేవ్యా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిగి నేరం రుజువు కావడంతో 9వ జిల్లా సెషన్స్‌కోర్టు, మెట్రోపాలిటన్ సెషన్స్‌కోర్టు న్యాయమూర్తి హరీష నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ.10 వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

చిగురించిన కంది ఆశలు

పెరిగిన పంట సాగు, దిగుబడి
- భారీ అంచనాల్లో అన్నదాతలు
- ఎకరాకు 6 క్వింటాళ్లు వచ్చే అవకాశం
- రూ.7 వేలు మద్దతు ధర ప్రకటించిన ప్రభుత్వం


మర్పల్లిలో ఏపుగా కాసిన కంది పంట

బషీరాబాద్: దేశంలోనే కంది పంటలకు ప్రసిద్ధి తాండూరు భూములు. నియోజకవర్గంలోని బషీరాబాద్ మండలంలో పంట ఈ ఏడు 'ఆశ' జనకంగా ఉంది. ఈ వానాకాలం సిజన్‌లో 17వేల ఎకరాల్లో రైతులు కందిని సాగు చేయగా.. అందులో మంతట్టి, నవల్గా, పర్వత్‌పల్లి, నీళ్లపల్లి, ఎక్మాయి, ఇందర్‌చెడ్, క్యాద్గీర, నావంద్గి, గంగ్వార్, జీవన్గీ గ్రామాల్లో ఎక్కువగా 'ఆశ' రకాన్ని సాగుచేశారు.

రైతుల ఆనందం

సకాలంలో విత్తులు విత్తడం, వర్షాలు అనుకూలంగా కురవడంతో కంది పంట పండిందని అన్నదాతలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. నల్ల రేగడి భూముల్లో ఎకరాకు 6 క్వింటాళ్ల దిగుబడి వస్తుందనే అంచనాతో ఉన్నారు. ప్రస్తుతం చెలక భూముల్లో కోతదశలో ఉండగా, రేగడి భూముల్లో కాత దశలో ఉంది. ముందుగా విత్తిన చెలక నేలల్లో అక్కడక్కడా కోతలు ప్రారంభమయ్యాయి. కాత జడలుగా కాయడంతో కంది దంట్లు బరువుకు నేల కొరిగాయని, మొత్తంగా దిగుబడి బాగానే రానుందని పేర్కొన్నారు.

మద్దతు ధర పెంచాలి

కందికి మద్దతు ధర ప్రభుత్వం ఈ సారి రూ.7 వేలుగా ప్రకటించింది. గతేడాది బయట మార్కెట్లో రూ.5 వేల నుంచి 6,600 వరకు ధర లభించిందని, ఈ సారి రూ.7వేలకు పెంచిందని రైతులు చెప్పారు. కాగా.. పెరిగిన ధరలతో పెట్టుబడికి అనుగుణంగా సర్కారు మద్దతు సరిపోదని, కనీస ధర రూ.10వేలకు పెంచాలని కోరుతున్నారు. అదే విధంగా మండలానికి ఒకటి చొప్పున కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి



బయట మార్కెట్‌లో కందుల ధరలు తక్కువగా ఉంటే.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలి. త్వరలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కావచ్చు. ప్రభుత్వ మద్దతు ధర గతం కంటే రూ.4 వందలు పెంచి, క్వింటాకు రూ.7వేలు చెల్లిస్తోంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– సూర్యప్రకాశ్, ఏఓ, బషీరాబాద్

విద్యుత్ సమస్య పరిష్కారమే లక్ష్యం

రంగారెడ్డి జోన్ సీజీఎం పి.ఆనంద్
- హస్నాబాద్‌లో ట్రాన్స్‌కో అధికారుల పర్యటన


ట్రాన్స్‌కో అధికారులకు సమస్యలు వివరిస్తున్న గ్రామస్తులు

కొడంగల్ రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రంగారెడ్డి జోన్ సీజీఎం పి.ఆనంద్ అన్నారు. శుక్రవారం కొడంగల్ మండలం హస్నాబాద్ గ్రామంలో వికారాబాద్ ఎస్‌ఈ వి.జయరాజు, తాండూరు డీఈ భానుప్రసాద్, కొడంగల్ ఏడీఈ నవీన్‌కుమార్, ఏఈలు, అధికారులతో కలిసి సీజీఎం పర్యటించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ పకీరప్ప ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులకు గ్రామస్తులు పలు సమస్యలను విన్నవించారు. వేలాడుతున్న విద్యుత్ తీగల స్థానంలో అదనంగా విద్యుత్ స్తంభాల ఏర్పాటుతో పాటు, అవసరమైన చోట పాతాలని కోరారు. ట్రాన్స్‌ఫార్మర్ కోసం రైతులు డీడీలు కట్టి రెండేళ్లు గడిచినా ఇవ్వడం లేదని తెలిపారు. ఈ విషయంపై విద్యుత్ అధికారులు స్పందిస్తూ.. సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సిద్ది లింగప్ప, చంద్రప్రకాష్, ఆనంద్, మల్లేశ్, రాములు, హనమంతు, లక్ష్మీకాంత్ రెడ్డి, నర్సన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

పెద్దేముల్: చెట్టుకు ఉరివేసుకొని గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల పరిధి రుక్మాపూర్ రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం సాయంత్రం చోటుకేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రైల్వే స్టేషన్ సమీపాన ఓ వ్యవసాయ పొలంలో యువకుడు చెట్టుకు ఉరి వేసుకున్నాడని రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా.. ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి ఒంటిపై నలుపు రంగు ప్యాంటు,చొక్కా ఉందని, వివరాలు తెలిసిన వారు ఠాణాలో సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు విచారణలో ఉంది.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి

వికారాబాద్ అర్బన్: మహిళలు, విద్యార్థినలను వేధించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వికారాబాద్ ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం షీటీం ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్‌లో విద్యార్థినులకు పలు విషయాలపై వారు అవగాహన కల్పించారు. బస్టాండ్‌లో, రోడ్డు వెంట ఎవరైనా ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇతరుల నుంచి ఏదైనా ప్రమాదం ఎదరైనా, వేధింపులకు గురైనా వెంటనే 100 లేక 181కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబర్ 1930కు కూడా సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. సమాచారం ఇచ్చినవారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. షీటీం హెడ్‌కానిస్టేబుల్ సీనయ్య, పీసీఎస్ బుచ్చేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలలో..

ధారూరు: మహిళా సాధికారిక కేంద్రం ఆధ్వర్యంలో ధారూరు కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయంలోని విద్యార్థులకు శుక్రవారం మహిళా చట్టాల గురించి అవగాహన కల్పించారు. వేధింపులు ఎదురైన మహిళలు, విద్యార్థినులు 1098, 181, 14567, 155326 హెల్ప్‌లైన్లకు కాల్‌చేసి సమస్యలను వివరించవచ్చని వారు సూచించారు. బాలికల సుకన్య సమృద్ధి యోజన, పీఎంజేఏబీవై, పీఎంఎస్‌బీవై, ఏపీవై పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారిక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ బల్‌రాం, జెండర్ స్పెషలిస్ట్ వరలక్ష్మి, బాబు, స్పెషలిస్ట్ ఫైనాన్షియల్ లిటరసీ అధికారి రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

రోహిత్ గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదు

- అక్రమ దందాలు చేసేవారు ఆరోపించడం తగదు
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న రాజుగౌడ్ తదితరులు

తాండూరు టౌన్: మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిపై ఆరోపణలు చేసే అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజుగౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పైలెట్ నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రోహిత్ వెంట ఉండి, ఆయనకు తెలియకుండా అక్రమ దందా చేసిన మురళీకృష్ణ గౌడ్.. ఆయనపై ఆరోపణలు చేయడం తగదన్నారు. చిలకవాగు కబ్జా, వంద ఎకరాల భూమి, అక్రమ సుద్ద వ్యాపారాలను బయటకు తీస్తామని హెచ్చరించారు. తాండూరులో కాంగ్రెస్ నాయకుడు కరువైతే, పక్క నియోజకవర్గం నుంచి, అది కూడా బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన వ్యక్తిని అరువు తెచ్చుకుని ఎమ్మెల్యేగా నిలబెట్టిన నాయకులు ధారాసింగ్, డాక్టర్ సంపత్‌కుమార్‌లు పార్టీ మారడంపై రోహిత్‌రెడ్డిని విమర్శించే హక్కు లేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న బీ–టీమ్ (గతంలో బీఆర్‌ఎస్‌లో ఉన్న) నాయకులు మాట్లాడే ముందు ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. రోహిత్ హయాంలో ప్రారంభమైన అభివృద్ధి పనులను నిలిపివేస్తే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. ఆరు గ్యారంటీలు, మేనిఫెస్టోలో చెప్పిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వీణ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప, నాయకులు నర్సింహులు, శ్రీనివాసాచారి, రవీందర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, శోభారాణి, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఇబ్రహీంపట్నం రూరల్: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి కోరారు. ఇబ్రహీంపట్నం మండలంలోని దండుమైలారం గ్రామంలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ప్రారంభించారు. ప్రచార రథంలో ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ప్రధానమంత్రి ప్రసంగాన్ని లైవ్‌లో వీక్షించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. అర్హులందరికీ కేంద్ర పథకాలు అందేలా చేయడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్యమన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా సహకరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లేశ్వరి, ఎంపీటీసీ అరుణగౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అశోక్‌గౌడ్, శ్రీశైలం, యాదగిరిరెడ్డి, దండె శ్రీశైలం, బ్యాంకు మేనేజర్ అనిల్‌రెడ్డి, డీహెచ్‌ఓ ధీరజ్, వ్యవసాయ అధికారి వరప్రసాద్, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

- వ్యక్తి అరెస్టు, రిమాండ్
- 18 కిలోల గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగరాజు

శంకర్‌పల్లి: గుట్టు చప్పుడు కాకుండా గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన మండలంలోని మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. డిటెక్టివ్ సీఐ నాగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జనవాడ అనుబంధ గ్రామమైన ఇంద్రారెడ్డి నగర్‌లోని సర్వీస్ రోడ్డు వద్ద ఆటోలో గంజాయిని విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో ఇబ్రహీంబాగ్‌కు చెందిన రాజు సింగ్ 18కిలోల గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. నిందితుడి నుంచి గంజాయి, ఆటో, ఒక ఫోన్‌ను స్వాధీనం చేసుకొని శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో మోకిల ఎస్‌ఐ కోటేశ్వర్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్దతు ధర కల్పించాలని ఆందోళన

మార్కెట్ యార్డు కార్యాలయం ఎదుట రైతుల నిరసన


మార్కెట్ యార్డులో నిరసన వ్యకం చేస్తున్న రైతులు

పరిగి: మద్దతు ధర ఇవ్వకుండా అధికారులు, దళారులు కుమ్మక్కై మోసం చేస్తున్నారని రైతులు ఆరోపించారు. వరికి మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ.. శుక్రవారం రాత్రి పరిగి మార్కెట్ యార్డులో ఆందోళనకు దిగారు. స్థానిక మార్కెట్ యార్డుకు సన్న రకం వరిధాన్యం విక్రయించేందుకు శుక్రవారం వేల బస్తాలు తీసుకువచ్చారు. రాత్రి బీట్లు చేయడంతో అధికారులు, దళారులు ఏకమై, ఏకంగా గత వారం కంటే రూ.500 క్వింటాల్‌కు తగ్గించారని ఆగ్రహించిన రైతులు.. మహబూబ్‌నగర్, షాద్‌నగర్ మార్కెట్ యార్డులో ఎలా కొనుగోలు చేస్తున్నారో తెలుసుకున్నారు. అక్కడ రూ.3300 నుంచి ప్రారంభం కాగా, పరిగిలో రూ.2800 నుంచి ప్రారంభం కావడంతో రైతులు అధికారులను నిలదీశారు. దీంతో మాకు ఏం సంబంధం లేదని, ఆన్‌లైన్‌లో వచ్చిన ధర ప్రకారం ఇస్తున్నామని అధికారులు పేర్కొనగా.. ఆన్‌లైన్ రేటు అంతటా సమానంగా ఉండాలని, ఎందుకు వ్యత్యాసం ఉందని రైతులు ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న పలువురు నాయకులు.. రైతులను సముదాయించి మద్దతు ధర వచ్చేలా కృషి చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

సమాజహితానికి భగవద్గీత

నందిగామ: ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రమైన కన్హా శాంతి వనంలో గీతా జయంతి సందర్భంగా శుక్రవారం గీతోపదేశ శిఖరాగ్ర సమావేశాన్ని నిర్వహించారు. టెక్ మహేంద్ర సీఈఓ సీపీ గుర్నానీ, ప్రఖ్యాత పండితుడు ఉదయ శ్రేయస్, ప్రముఖ పారిశ్రామికవేత్త వివేక్ వాధ్వాలు పాల్గొన్న ఈ సమావేశంలో వర్చువల్‌గా పలు దేశాలకు చెందిన సుమారు 2వేల మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ.. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సమాజంలోని ప్రతి ఒక్కరూ భగవద్గీత సారాంశాన్ని తెలుసుకోవల్సిన అవసరం ఉందన్నారు. భగవద్గీత పిల్లలకు జీవిత నైపుణ్యాలను పెంపొందింపజేసేందుకు ఎంతగానో కృషి చేస్తుందని వివరించారు. శ్లోకాలను పఠించడంతో పాటు నిరంతరం ధ్యానం చేయడం వల్ల ప్రతి ఒక్క విద్యార్థి సమాజహితం వైపు నడుస్తారన్నారు. అనంతరం శ్రీరామచంద్ర మిషన్ గురూజీ కమ్లేష్ పటేల్(దాజీ) మాట్లాడుతూ.. భగవద్గీత చాలా లోతైన పుస్తకమని, మేధావులు అధ్యాయనం చేశారని అన్నారు. భగవద్గీతను ఆచరణాత్మకంగా తీసుకురావల్సిన అవసరం ఉందన్నారు. రెండు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ ముఖ్యం

- నారుమడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి
- విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ
- జిల్లా వ్యవసాయాధికారిణి గీతారెడ్డి


గీతారెడ్డి


యాసంగికి సిద్ధమవుతున్న నారు

షాబాద్: రైతులు ఆరుగాలం శ్రమించి పండిస్తేనే సమస్త మానవాళి కడుపు నిండేది. ప్రస్తుతం రాష్ట్రంలో యాసంగి సీజన్ ప్రారంభమైంది. దీంతో అన్నదాతలు దుక్కులు దున్నుతూ వరి నారు పోసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో నారుమడిలో యాజమాన్య పద్ధతులు, విత్తన శుద్ధితో కలిగే ప్రయోజనాలను జిల్లా వ్యవసాయాధికారిణి గీతారెడ్డి వివరించారు.

విత్తన శుద్ధి

నారు పోసే ముందు విత్తన శుద్ధి చేయాలి. తద్వారా పంటకు పలు రకాల కీటకాలు, తెగుళ్లు ఆశించవు. కిలో విత్తనాలకు 2.5 గ్రాముల కార్బండైజిమ్‌తో కలిపి 24 గంటలు నానబెట్టాలి. లేదా కిలో విత్తనాలకు 3 గ్రాముల కాప్టన్ మందు కలిపి మడిలో చల్లుకోవాలి. దీనివల్ల నారుమడిలో ఆకు తినే పురుగు, ఉలికోడు, ముప్వ పురుగు ఆశించకుండా ఉంటుంది.

నారుమడి తయారీ

నారు పోయాల్సిన మడిని పలు దఫాలుగా దున్ని చదును చేయాలి. నీరు పారించడానికి.. ఎక్కువైతే తీయడానికి అనుకూలంగా తయారు చేసుకోవాలి. ఎకర పొలం నాటడానికి అరగుంటలో 5 కిలోల విత్తనాలు వాడాలి. అరగుంట నారుమడికి రెండు కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్ ఉండే ఎరువులు వినియోగించుకోవాలి.

కలుపు నివారణ

నారుమడిలో కలుపు నివారణకు ఎకరాకు బూటాక్లోర్ 1.5 మి.లీ, ఒక లీటర్ నీటిలో కలిపి విత్తిన 7 లేదా 8వ రోజున నీటిని తొలగించి పిచికారీ చేయాలి. విత్తిన 15 రోజులకు సైహాలోపాస్ బ్యూటైల్ 10 శాతం మందును 200 లీటర్లలో కలిపి పిచికారీ చేయాలి. విత్తిన పది రోజులకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు అరగుంట నారుమడికి 150 గ్రాముల చొప్పున చల్లాలి. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ మందును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. జింక్ లోపాన్ని గమనిస్తే లీటర్ నీటిలో 2 గ్రాముల జింక్ ఫాస్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. నారు 20–25 రోజుల వయసు ఉన్నపుడు 4 నుంచి 6 ఆకుల దశలో నాటుకోవడం వల్ల దిగుబడి అధికంగా వస్తుంది.

నాటు వేసే విధానం

నారు ఆకు లేతగా ఉంటేనే చేను తొందరగా పెరుగుతోంది. 4 నుంచి 6 ఆకులు ఉన్న నారును ఉపయోగించాలి. ముదురు నారు వాడితే దిగుబడి తగ్గుతుంది. నారు లోతులో కాకుండా పైపైన నాటితే ఎక్కువగా పిలకలు వచ్చే అవకాశం ఉంటుంది. నాట్లు వేసేటప్పుడు భూసారాన్ని బట్టి ఖరీఫ్‌లో చదరపు మీటరుకు 44 నారు మొలకలు ఉండేలా నాటుకోవాలి.

చలి నుంచి రక్షణ చర్యలు

చలి ప్రభావం నుంచి నారు మడుల్లో ఎదగకపోవడం, ఆకులు పసుపు, ఎరుపు రంగుల్లోకి మారుతుంటాయి. దానికి కింది జాగ్రత్తలు తీసుకోవాలి.
- సాయంత్రం వేళలో నీరు తీసి పగటిపూట వెచ్చటి నీరు పారించాలి.
- రోజూ సాయంత్రం అడుగు ఎత్తులో వెదురు చెక్కలు అమర్చి దానిమీద సన్నటి ప్లాస్టిక్ షీట్ లేదా కల్లాలకు వాడే పట్టాలు నారుమడి మీద కప్పి మరుసటి రోజు ఉదయం తీసేయాలి.
- జింక్ లోపం వల్ల ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడితే జింక్ సల్ఫేట్‌ను లీటర్ నీటికి 2 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

తల్లిని చంపిన కేసులో..

- కొడుకు కోడలికి జీవిత ఖైదు
- రూ.10వేల జరిమానా

కడ్తాల్: రెండేళ్ల క్రితం మండల పరిధిలోని నార్లకుంటతండా గ్రామ పంచాయతీలో జాతోత్ బిచాలి(58) హత్యకేసులో, కొడుకు కిషన్‌నాయక్ కోడలు విజయలకు జీవితఖైదు, రూ.10 వేలు జరిమాన విధిస్తూ, ఎల్బీనగర్ కోర్టు తొమ్మిదోవ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి హరీశ్ తీర్పు వెలువరిచారని ఎస్‌హెచ్‌ఓ శివ ప్రసాద్ తెలిపారు. కేసుకు సంబంధించి సీఐ శివ ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని నార్లకుంట తండా గ్రామ పంచాయతీకి చెందిన జాతోత్ బిచాలికి ముగ్గురు కూతుళ్లు, కుమారుడు కిషన్‌నాయక్ ఉన్నారు. భూ తగాదాలు మనస్సులో పెట్టుకుని కుమారుడు కిషన్‌నాయక్, అతని భార్య విజయలు కలిసి 2021, జూన్ 11వతేదీ రాత్రి తల్లి బిచాలిని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారు. ఇదిలా ఉండగా జూన్ 12వ తేదీ ఉదయం బిచాలి మృతదేహాన్ని చూసిన కూతురు రామవత్ సుశీల తల్లి మృతిపై అనుమానం ఉందని స్థానిక కడ్తాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ సుందరయ్య కేసు నమోదు చేసుకున్నారు. ఈ కేసును ఆమనగల్లు సీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేయగా నిందితులు అసలు నిజం ఒప్పుకున్నారు. దీంతో బిచాలి హత్య కేసులో కుమారుడు కిషన్‌నాయక్ అతని భార్య విజయలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తదుపరి కేసు దర్యాప్తు పూర్తయిన అనంతరం వారిపై ఎల్బీనగర్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం సాక్ష్యధారాల అనంతరం ఎల్బీనగర్ కోర్టు తొమ్మిదోవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి హరీష తీర్పు వెలువరించారు. కిషన్‌నాయక్, కోడలు విజయలకు జీవితకాలపు శిక్ష, రూ.10వేలు జరిమాన విధిస్తూ తీర్పు వెలువరించారని ఎస్‌హెచ్‌ఓ శివ ప్రసాద్ పేర్కొన్నారు.

సిబ్బందిని అభినందించిన ఉన్నతాధికారులు..

ఈ కేసును దర్యాప్తు చేసిన ఎస్‌ఐ సుందరయ్య, సీఐ ఉపేందర్‌లను, సరైన సమయంలో సాక్షులను కోర్టు వద్ద బ్రీఫింగ్ చేసిన అధికారులను, హత్య కేసులో నిందితులకు శిక్ష పడటానికి కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఘు, ఎస్‌ఐలు హరిశంకర్‌గౌడ్, పంకజ, ఏఎస్‌ఐ బాలస్వామి, హెడ్ కానిస్టేబుల్ జానయ్య, కానిస్టేబుల్ రవిలను పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారని ఎస్‌హెచ్‌ఓ శివ ప్రసాద్ తెలిపారు.